ప్రజాశక్తి
శుక్రవారం 15 నవంబర్ 2024
5
అల్లూరి సీతారామరాజు



చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలి : సిపిఎం

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ మండలం బస్కి పంచాయితీ బస్కి, జాకరవలస గ్రామానికి చెందిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు డిమాండ్ చేశారు. గురువారం అరకు ఏరియా ఆసుపత్రిలో పర్యటించి చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతమూడు రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా చిన్నారులకు సరైన వైద్యం అందలేదని తెలిపారు. అరకువేలి ఏరియా ఆసుపత్రిలో చిన్నారులకు అన్ని రకాల రక్త పరిక్షలు నిర్వహించి వైద్యం అందించాలన్నారు. తక్షణమే వైద్య సిబ్బంది స్పందించి చిన్నారులను మెరుగైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.


రోగులను పరామర్శిస్తున్న రామారావు

భారాలపై సిపిఎం ప్రజాపోరు

-తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు



ముంచంగిపుట్టులో ధర్నా చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: పెరిగిన నిత్యావసర ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ స్థానిక సిపిఎం నాయకులు గురువారం మండల కేంద్రంలోని తహాసిల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి డిప్యూటీ తహాసిల్దార్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఎస్ బి పోతురాజు మాట్లాడుతూ, నిత్యావసర ధరలు పెరగడంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు కొనుగోలు చేసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.. పెరిగిన ధరలను వెంటనే తగ్గించాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పి.సురేష్, కుమార్, టి.సూర్యనారాయణ, పి.సత్యనారాయణ, పి దొంబు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



డుంబ్రిగుడలో..

అరకులోయ రూరల్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఆలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజా పోరులో భాగంగా మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు మాట్లాడుతూ, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న బారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజలపై మోపిన ట్రూ అప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు విరమించు కోవాలన్నారు. జిల్లాలో కాపీ రైతులకు సుమారు 62 కోట్ల బకాయిలు చెల్లించాలని, గిట్టుబాటు ధర పెంచాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యావసర ధరలు పెంచి పేదల నడ్డి విరుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.మగ్గన్న, కె బుజ్జిబాబు, టి.హరి, స్వాభి బీమా, వంజుల ,మహేష్, కొర్రా మూర్తి, సుమిత్ర, జానకి, సుందరి, బొందో తదితరులు పాల్గొన్నారు.

ముంచింగి పుట్టు: ప్రజా పోరులో భాగంగా నాలుగు రోడ్ల కూడలి వద్ద సిపిఎం నేతలు నిరసన ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఉచిత ఇసుక పంపిణీ చేయాలని, ఆదివాసుల స్పెషల్ డిఎస్సి నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిత్యవసర సరుకులు ధరలు తగ్గించాలని, విశాఖ హుక్కు పరిరక్షించాలని, విద్యుత్విద్యుత్ ఛార్జ్ బిల్లులను ప్రభుత్వం బరించాలని నినాదాలు చేపట్టారు. తహసిల్దార్ కార్యాలయ సిబ్బందిభూపతి, హౌసింగ్ ఏఈ కష్ణారావు లకు వినతి పత్రాలను అందజేశారు. మండల కార్యదర్శి కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, పీఎం జన్మన్ గృహాలకు ఐదు లక్షలు కేటాయించి, ఉచిత ఇసుక అందించాలన్నారు. పివిటిజిలకు ఆదుకోవాలన్నారు. విద్యుత్ ట్రూ అప్ చార్జలు ప్రభుత్వమే భరించాలన్నారు. కాపీ రైతుల బకాయి సొమ్ము విడుదల చేసి రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేయాలని డిమాండ్ చేశారు. మండల వైస్ ఎంపీపీ పాటుబోయి సత్యనారాయణ మాట్లాడుతూ.. జీవో నెంబర్ 3 పునరుద్ధరణ చేసి నూటికి నూరు శాతం ఉద్యోగ అవకాశాలను ఆదివాసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు

సిపిఎం మాజీ కార్యదర్శి భీమరాజు మాట్లాడుతూ, నిత్యవసర ధరలు తగ్గించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు కొర్రా త్రినాథ్, వైస్ ఎంపీపీ 1 పాటు బోయి సత్యనారాయణ, పాంగి భీమరాజు, ఎంఎం శ్రీను, శంకర్రావు, నరసయ్య, లైకోన్, జర్రెల ఉప సర్పంచి గణపతి, నారాయణ, రామదాసు,నర్సింగ్ పడాల్ పాల్గొన్నారు.

విఆర్.పురం : సిపిఎం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గురువారం మండల కేంద్రం రేఖపల్లిలో తహశీల్దారు కార్యాలయం ఎదుట ఆ పార్టీ ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. దీనికి ముందు స్థానిక సిపిఎం కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించారు. అ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల విధానం రద్దు చేయాలని, ట్రూ అప్ ఛార్జీల పేరుతో విధించి విద్యుత్ భారాన్ని ప్రభుత్వమే చెల్లించాలని, నిత్యవసర ధరలు తగ్గించాలని, 2022 వరదల ప్రామాణికంగా పోలవరం ప్రాజెక్టు ముంపు గ్రామాలను గుర్తించి నిర్వాసితులు అందరికీ ప్యాకేజి పునరావాసం కల్పించాలని, భూనష్ట పరిహారం చెల్లించాలని, ఏజెన్సీ డిఎస్సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్ వెట్టి లక్ష్మి, సిపిఎం మండల కార్యదర్శి సోయం చినబాబు, నాయకులు పులి సంతోష్ కుమార్, పంకు సత్తిబాబు, వడ్డాది రమేశ్, కుంజా నాగిరెడ్డి, పోడియం శ్రీరామమూర్తి, కారం సుందరయ్య, సోడి మల్లయ్య, కాంతారావు, కమ్మచిచ్చు సత్తిబాబు, సీహెచ్చ్ సుబ్బారావు, వేటగాని సూరి నాగరాజు, రమేష్ ప్రజలు పాల్గొన్నారు.



అరకులోయలో వినతిపత్రాన్ని ఇస్తున్న నాయకులు



విఆర్ పురంలో...

పిల్లల భవిష్యత్తుపై శ్రద్ధ వహించాలి

-జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు: పిల్లల భవితకు పెద్దలు భాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక శ్రీకృష్ణాపురం గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో నిర్వహించిన నెహ్రూ జయంతి వేడుకలలో ముఖ్య అతిధిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలకు చదువుకునే హక్కుతో పాటు జీవించే హక్కు ఉందన్నారు. వారి చదువుకు ఎటువంటి ఆటంకం కలగకుండా మంచి వాతావరణం, జీవ వైవిధ్యం ఉండేలా చూడాలన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులకంటే ఉపాధ్యాయులతోనే ఎక్కువ కాలం గడుపుతారని, వారి భవితకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. వారిలో నాయకత్వ లక్షణాలు కల్పించి, నైపుణ్యాలను వెలికి తీయాలని సూచించారు.

గిరిజన సంక్షేమ శాఖ ఇంచార్జ్ ఉప సంచాలకులు కుమారి రజని మాట్లాడుతూ, బేస్ లైన్ పరీక్ష నిర్వహించి సి,డి గ్రేడుల వారికి ప్రత్యేక శిక్షణను ఇస్తున్నారన్నారు. ఉన్నత శిఖరాలు అధిరోహించే విధంగా మార్గదర్శి కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని తెలిపారు.

జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు మాట్లాడుతూ, పిల్లలకు ఒత్తిడి లేని చదువుకు అవకాశం కల్పించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు నిర్వహించిన సంస్కతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. విదార్థులకు నిర్వహించిన పోటీలలో గెలుపొందిన వారికి కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ముందుగా కలెక్టర్ నెహ్రూ చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

'జన్ మన్' తరలివెళ్లిన కళాకారులు

ప్రజాశక్తి-పాడేరు: భగవాన్ బిర్సా ముండా జయంతి సందర్భంగా విజయవాడలో ఈ నెల 15 నిర్వహిస్తున్న జన్ మన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు విడివికే బృందం గురువారం పాడేరులో బయలుదేరి విజయవాడ ప్రయాణ మయ్యారు. దింసా కళాకారులు, లక్క బొమ్మలు తయారీ కళాకారులు, జన్ మన్ కార్యక్రమంలో లబ్ధి పొందిన ఆధార్ లబ్ధిదారులు, గృహ నిర్మాణ లబ్ధిదారులు, ఆయుష్మాన్ భారత్ కార్డులు పొందిన లబ్ధిదారులు 44 మంది గిరిజనులు జన్ మన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న సభ్యుల బస్సును ఐటిడిఎ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం. వెంకటేశ్వరరావు, డి ఆర్ డి ఏ పిడి వి. మురళి సంయుక్తంగా గురువారం ఉదయం ఐటీడీఏ కార్యాలయం వద్ద జండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏపీవో ఎం. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, గిరిజన కళాకారులు దింసా నృత్యం, స్వయం సహాయక బృందం సభ్యులు కోలాటం ప్రదర్శన చేస్తారని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గిరిజన సంక్షేమ పథకాలపై లబ్ధిదారులతో ముచ్చటిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు సిబ్బంది అప్పారావు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

క్రీడల్లోనూ నైపుణ్యం పెంచడానికి చర్యలు

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు విద్యతోపాటు క్రీడల్లోనూ నైపుణ్యాన్ని పెంచే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. ఈ నెల 8 నుండి 10వ తేదీ వరకు జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుండి బందపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలురు పాఠశాల నుండి ఐదుగురు విద్యార్థులు పాల్గొని 12 గోల్డ్ మెడల్స్, రెండు సిల్వర్ మెడల్స్ సాధించారు. ఈ మేరకు మెడల్స్ సాధించిన కె.సర్విన్ బాబు దొర, కె.లోకేష్ దొర, కె.కళ్యాణరావు, సిహెచ్.వరుణ్ తేజ, కె.దినేష్ కుమార్ గురువారం స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఐదుగురు విద్యార్థులను ప్రాజెక్ట్ అధికారి అభినందించారు. గోల్డ్మెడల్స్ సాధించిన సిహెచ్.కళ్యాణ్రావు, కే.సర్విన్ బాబు దొర, కే లోకేష్దొర ఢిల్లీ, మహారాష్ట్రలో జరుగు జాతీయస్థాయిలో క్రీడా పోటీల్లో పాల్గొంటారు. గోల్డ్ మెడల్స్ సాధించిన విద్యార్థులకు క్రీడల్లో ఇంకా నైపుణ్యం పెంచే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని పిఒ సింహాచలం చెప్పారు. ఏజెన్సీలోని అన్ని ఆశ్రమ పాఠశాలల్లో పిఇటిలు, పీడీలు క్రీడల్లో మక్కువ ఉన్న విద్యార్థులను గుర్తిస్తే వారిని ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో బందపల్లి ప్రధానోపాధ్యాయులు యం.శ్రీరాములు, పిడి కె.తిరుపతిరావు, యం.కరుణ విలాస్ తదితరులు పాల్గొన్నారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

యుటిఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అడ్డతీగల

మండల కేంద్రంలోని ఎంఈఓ కార్యాలయ ఆవరణలో జరిగిన ఆంధ్ర ప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) మండల సమావేశంలో సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ఎన్నికల అధికారిగా యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వై.విల్సన్‌బాబు, పర్యవేక్షులుగా తేజరావు వ్యవహరించారు. యుటిఎఫ్ మండల గౌరవాధ్యక్షులుగా ఎస్.కుసులన్న, అధ్యక్షునిగా కె.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కేవీ.రాఘవులు, సహాధ్యక్షులుగా ఎస్.జగదీష్, మహిళా అధ్యక్షురాలుగా జేబీవీ.రమణమ్మ, కోశాధికారిగా బి.దొరబాబు, కే.చిన్నారావు, ఎస్.నాగన్న దొర, మహిళా కార్యదర్శిగా పీవీ.లక్ష్మీప్రభ, జి.పోలయ్య, పి.రాజరెడ్డి, కే.అబ్బాయిరెడ్డి, పి.అప్పారావు, ఎం.సత్య అపర్ణ, ఎం.సతీష్ రెడ్డి, ఎం.అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి యుటిఎఫ్ జిల్లా ఆడిటర్ పి.మంగరాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.


నినాదాలు చేస్తున్న విద్యార్థులు

ప్రతి విద్యార్థికీ ఉపకార వేతనాలు అందించాలి

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: విద్యార్థులకు అందిస్తున్న ఉపకార వేతనం ప్రతి ఒక్క కాపీ రైతుల పిల్లలకు అందించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కిండంగి రామారావు డిమాండ్ చేశారు. గురువారం అరకులోయ మండల కేంద్రంలోని కాపీ బోర్డు కార్యాలయం వద్ద విద్యార్థులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సంధర్భంగా రామారావు మాట్లాడుతూ,కాపీ బోర్డు వారు అందిస్తున్న ఉపకార వేతనం అందరికీ చేరే విధంగా కళాశాల యాజమాన్యానికి తగిన సూచనలు చేస్తూ ఐటీడీఏ, జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్క కాపీ రైతుల పిల్లలకు ఉపకర వేతనం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ఉపకార వేతనానికి దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్క విద్యార్థిని, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునే వెసులుబాటు కల్పించాలన్నారు.

గిరిజనుల మరణాలపై పట్టించుకోరా


-జెడ్పిటిసి గంగరాజు

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని గుమ్మ పంచాయతీ పరిధి కరిగుడ గ్రామంలో వరుస మరణాలు చోటు చేసుకుంటున్నా వైద్యశాఖ అధికారులకు పట్టదా అని స్థానిక జెడ్పిటిసి దీసరి .గంగరాజు సూటిగా ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో గురువారం మాట్లాడుతూ, కర్రిగుడ గ్రామంలో పది మందికి పైగా వాంతులు, విరోచనాలతో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారన్నారు. గురువారం బడ్నాయిని. సుక్రమ్మ (55) మృతి చెందగా, మృతురాలి కుమారుడిని కుటుంబ సభ్యులు కేజిహెచ్‌కు వైద్యం కోసం తరలించారన్నారు. వారం రోజుల క్రితం వాంతులు, విరోచనాలతో బాధ పడుతున్న సారా. లచ్చన్నను కుటుంబ సభ్యులు డోలి సహాయంతో వైద్యం కోసం కొండ కోనల నడుమ నుండి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడన్నారు. గ్రామంలో ఇంటింటా అదే పరిస్థితిలో గిరిజనులు మంచాన పడ్డారన్నారు. జన్ని గంగమ్మ, బడ్నాయిని దానియల్, జన్ని. కొండమ్మ, బోయిన. రామన్నతో పాటు మరి కొంతమంది తీవ్ర అస్వస్థతకు గురై మంచాన పడ్డారన్నారు. నిమ్మ ఊట నుండి కరిగుడ, కడరేవు గ్రామాలకు మంజూరైన రోడ్డు పనులు తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.



సిపిఎం మండల కార్యదర్శిగా కె.రామారావు

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అరకులోయ సిపిఎం మండల కార్యదర్శిగా కె రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అరకులోయలో ఆదివాసి గిరిజన సంఘం భవనంలో జరిగిన మండల మహాసభ నిర్వహించారు. మండల మహాసభ సిపిఎం జిల్లా కార్యదర్శి పి అప్పలనర్స, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి ఉమామహేశ్వరరావు సమక్షంలో నూతన మండల కార్యదర్శిగా కె రామారావు ఎన్నికయ్యారు. మండల కార్యదర్శివర్గ సభ్యులుగా పి బాలదేవ్, జి చిన్నా బాబు, జె భగత్ రామ్, కొర్ర మగ్గన తో పాటు 16 మంది మండల కమిటి సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల కార్యదర్శి కె రామారావు మాట్లాడుతూ. ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేస్తామన్నారు.



భవిష్యత్తు పోరాటాలకు సిద్ధం కావాలి

- గ్రామ వాలంటీర్లు జిల్లా సదస్సులో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి
- యూనియన్ జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-రంపచోడవరం

గ్రామ, వార్డు వాలంటీర్లు తమ ఉద్యోగ భద్రత కోసం భవిషత్యులో పోరాటాలకు సిద్ధం కావాలని ఎపి గ్రామ/వార్డు వాలంటీర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి పిలుపునిచ్చారు. గ్రామ వాలంటీర్ల ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా సదస్సు గురువారం రంపచోడవరంలో జరిగింది. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో గ్రామ వాలంటీర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వాలంటీర్లను రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం మోసం చేస్తోందన్నారు. తక్షణమే వాలంటీర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని, బకాయి వేతనాలతో పాటు రూ.10వేలు వేతనం పెంచి చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వాలంటీర్ వ్యవస్థ అసలు లేదంటూ మాట్లాడటం ఏమిటనీ ప్రశ్నించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు మాట్లాడుతూ జిల్లా సదస్సు భవిష్యత్ ఉద్యమాలకు స్ఫూర్తిదాయకం కావాలన్నారు. ఈ సదస్సు సంద్భంగా 37 మందితో యూనియన్ జిల్లా కమిటీ ఎన్నికైంది. వాలంటీర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా పోడియం జానీ, కార్యదర్శిగా సుబ్రమణ్యం, కోశాధికారిగా చుండం, కళావతి, ఉపాధ్యక్షులుగా కుమార్, సీహెచ్,మహేష్, సహాయ కార్యదర్శులుగా నేసిక, వెంకన్న, కె.మహేష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు మట్ల వాణిశ్రీ, జిల్లా, ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి

ఉపాధి హామీలో అవకతవకలు బయటపెట్టాలి

ఎపి ఆదివాసీ గిరిజన సంఘం మండల నేతలు చంటిబాబు, బాలయ్య

ప్రజాశక్తి-సీలేరు

జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనుల్లో చోటుచేసుకున్న అవకతవకలను, అవినీతిని సోషల్ ఆడిట్ అధికారులు బయటికి తీయాలని ఎపి ఆదివాసీ గిరిజన సంఘం జీకే వీధి మండల అధ్యక్ష కార్యదర్శులు ఎం.చంటిబాబు కొర్ర బాలయ్య డిమాండ్ చేశారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జికె.వీధి మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, నేమ్ బోర్డ్సులో అనేక అవకతవకులు జరిగాయని, వీటిపై సమగ్ర ఆడిట్ జరిపి నిగ్గు తెలిస్తే లక్షలాది రూపాయలు అవినీతి బయటపడుతుందని పేర్కొన్నారు. ఉపాధి హామీ ఆడిట్ అధికారులు పనులు నిర్వహించిన సిబ్బందితో కుమ్మక్కై ఒప్పందాలు కుదుర్చుకొని జరిగిన అవినీతిని పూర్తిస్థాయిలో బయట పెట్టడం లేదని విమర్శించారు. రూ.లక్ష నుండి రూ.2 లక్షల వరకు రికవరీలు రాసి చేతులు దులుపుకుంటున్నారన్నారు. ఉపాధి హామీ పనులపై ఆడిట్ అధికారులు జరిపిన సోషల్ ఆడిట్‌పై జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ సమగ్ర దర్యాప్తు జరిపి అవినీతిని బయటికి తీయాలని కోరారు. అధికారులు చర్యలు చేపట్టకపోతే పాడేరు కలెక్టరేట్ ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల నాయకులు పాంగి బాబురావు పాల్గొన్నారు.


విలేకర్లతో మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు


దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

చాగంటి హరిశర్మ, శేషకుమారి దంపతుల షష్టి పూర్తి సందర్భంగా తెలుగుదేశం బూత్ ఇన్చార్జి కాళ్ళకూరి సుందరం ఆధ్వర్యాన మండలంలోని చిన్నయ్యపాలెం గ్రామంలో 100 మంది గిరిజన వృద్ధులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. చలికాలం వచ్చిన నేపథ్యంలో వృద్ధులు ఇబ్బంది పడకుండా దుప్పట్లు పంపిణీ చేసినట్లు సుందరం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు గణజాల తాతారావ్, వాసంశెట్టి గంగాధర్, మాజీ సర్పంచ్ కోపూరి రత్నం, చెక్కా పండుబాబు, సాగిన చిన్నమ్ములు, రేలంగి శ్రీను, చిన్నోడు, మల్లి, చిన్నాలమ్మ, లక్ష్మి, కోపూరి గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

450 కేజీల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

రాజవొమ్మంగి గ్రామ శివారులోని ఒక ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 450 కేజీల పిడిఎస్ (రేషన్) బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నిందితునిపై 6ఎ కేసు నమోదు చేసినట్లు తహశీల్దార్ అల్లు సత్యనారాయణ గురువారం తెలిపారు. రాజవొమ్మంగి గ్రామానికి చెందిన పి వెంకటరమణ ఇంటిలో అక్రమంగా బియ్యం దాచి ఉంచినట్లు సమాచారం అందుకున్న ఆర్ఐ చెల్లయ్యమ్మ, విఆర్వో సూర్యకాంతం దాడి చేసి పట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.


పట్టుబడిన బియ్యాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

నేడు ఉద్యోగులకు ప్రత్యేక గ్రీవెన్స్

-యధావిధిగా "మీకోసం"

- జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి పాడేరు, : ఈనెల 15వ తేదీ శుక్రవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల వరకు ఎంప్లాయిస్ కోసం ప్రత్యేకంగా గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్ దినేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకు ప్రకటించిన విధంగా మూడవ శుక్రవారం కనుక ఈ ఎంప్లాయిస్ గ్రీవెన్స్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉద్యోగుల కోసం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ వివరించారు. వివిధ ప్రభుత్వ శాఖల సిబ్బంది అధికారులు ఈ గ్రీవెన్స్ లో పాల్గొని వారి సమస్యలు కలెక్టర్ దృష్టికి తీసుకురావచ్చని సూచించారు.

ఐటిడిఏ సమావేశమందిరంలో యధావిధిగా "మీకోసం"ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేసారు. ఆరోజు ఉదయం యధావిధిగా మీకోసం కార్యక్రమంలో ఫిర్యాదు దారులు పాల్గొని ఫిర్యాదులు అందించవచ్చని తెలిపారు



శంకుస్థాపన చేస్తున్న స్థానిక సర్పంచ్

జల జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -హుకుంపేట :మండలంలోని శోభకోట పంచాయతీ గొడిబీరి, అర్లడా తదితర గ్రామాలలో జల జీవన్ మిషన్ పనులకు స్థానిక సర్పంచ్ శశిభూషణం నాయుడు గురువారం శంకుస్థాపన చేపట్టారు. అనంతరం స్థానిక సర్పంచ్ మాట్లాడుతూ, గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు వంటి అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో పంచాయతీలో నిధులు లేక గిరిజన మారుమూల గ్రామాలకు చీకట్లో ఉండేవన్నారు. సర్పంచ్ పలసీ శశిభూషణ్ నాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కరిగుడలో అధికారుల పర్యటన

ప్రజాశక్తి -అనంతగిరి:వాంతులు, విరోచనాలు, కాళ్లు చేతుల ఉబ్బసంతో గిరిజనులు మృత్యువాత పడుతున్నారని వచ్చిన వార్తా కథనాలకు అధికారులు స్పందించారు. ఎంపీడీవో కుమార్ ఆధ్వర్యాన వైద్య. రెవిన్యూ. శాకల అధికారులు హుటా హుటిన సందర్శించారు. గిరిజనులు మాట్లాడుతూ, సరైన రోడ్డు సౌకర్యం లేక సకాలంలో వెళ్లలేని పరిస్థితితో డోలి మోతలతో వెళ్లాల్సి వస్తుందన్నారు.గిరిజనులు తెలిపిన విషయాలన్నీ నివేదిక రూపంగా జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లామని ఎంపీడీవో ఏవివి. కుమార్, ఉప తహసిల్దార్ .మాణిక్యం అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి -పాడేరు: వైద్య ఆరోగ్యశాఖ క్షేత్రస్థాయి ఉద్యోగులు తమ సమస్యల్ని పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ పాడేరులో భారీ ర్యాలీ ధర్నా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ సెంటర్ నుంచి ఐటీడీఏ మీదుగా జిల్లా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా ఏజెన్సీ ప్రాంత మెడికల్ ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఎఫ్ఆర్ఎస్ గురించి క్షేత్ర సిబ్బందికి మినహాయింపు ఇవ్వాలని, ఎఫ్ ఆర్ ఎస్ తో జీతాలు అనుసంధానం చేయరాదన్నారు. సచివాలయ ఏఎన్ఎంల సీనియారిటీ జాబితాలో తప్పిదాలను సవరించాలని, కాంట్రాక్టు ఉద్యోగులకు 100శాతం గ్రాస్ శాలరీ చెల్లించాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ అయిన హెల్త్ అసిస్టెంట్ల జాబితా సర్వీస్ రిజిస్టర్ లలో నమోదు చేయాలని ,అర్హులైన ఏఎన్ఎంలకు హెచ్వీలుగా పదోన్నతి కల్పించాలని తదితర సమస్యలపై మెడికల్ ఉద్యోగులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ కు ఉద్యోగ సమస్యలపై వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా యూనియన్ నాయకులు శెట్టి నాగరాజు , మాధవి లత సమస్యలు కలెక్టర్కు వివరిస్తూ... క్షేత్రస్థాయి వైద్య ఆరోగ్య ఉద్యోగులు అనేక సమస్య లతో బాధపడుతున్నామనీ. ముఖ్యంగా ఎఫ్ ఆర్ ఎస్ అనేది ఫీల్డ్ సిబ్బందికి ఉండడం మూలంగా గిరిజన ప్రాంతంలోనీ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇబ్బంది పడతారన్నారు.ఎఫ్.ఆర్.ఎస్ ద్వారా జీతాలు చెల్లించే విధానాన్ని నిలుపుదల చేయాలని, ఫీల్డ్ సిబ్బందికి మినహాయింపు ఇవ్వాలన్నారు. అర్హులైన ఏఎన్ఎంలకు హెచ్.వి ప్రమోషన్ కల్పించాలని కోరారు.సచివాలయం హెల్త్ సెక్రటరీలకు వైద్యశాఖ విధులు తప్ప వేరే విధులు చేయరాదని ఉత్తర్వులు ఇచ్చిన అమలు చేయడం లేదని తెలిపారు.డిప్యూటేషన్ లో నిజమైన బాధితులకు న్యాయం జరగ లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అల్లూరు జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సుందర్ రావు, కంబిడి లక్ష్మణరావు, సచివాలయ హెల్త్ సెక్రటరీ యూనియన్ అధ్యక్షులు కుమారి, తులబోతి, బాలయ్య పాల్గొన్నారు .



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న ఉద్యోగులు

సిఎం చంద్రబాబుకు దొన్నుదొర కృతజ్ఞతలు



సిఎంతో దొన్నుదొర

ప్రజాశక్తి-హుకుంపేట: -ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం రీజనల్ బోర్డు చైర్మన్‌గా నియమించినందుకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రుణపడి ఉంటానని అరకు టిడిపి ఇంచార్జి, ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం రీజనల్ బోర్డు చైర్మన్ సియ్యారి దొన్నుదొర కృతజ్ఞతలు తెలిపారు. గురువారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్ష, అరకు నియోజకవర్గం ఇన్చార్జి పదవి ఇచ్చి ఎన్నికల్లో ఇచ్చిన మాట ద్వారా ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం రీజనల్ బోర్డు చైర్మన్ పదవి ఇచ్చినందుకు కూటమి పెద్దలందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఆర్టీసీ ద్వారా సామాన్య ప్రజలకు సమర్థవంతమైన సేవలందించేందుకు తనవంతు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఏపీఎస్ఆర్టీసీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు రవాణా శాఖ మంత్రితో కలిసి కృషి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు తెలియజేసినట్లుగా దొన్నుదొర మీడియాకు తెలిపారు. తెలుగుదేశం పార్టీ మరింతగా బలోపేతం అయ్యేలా కృషి చేయాలని తనకు ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట టిడిపి సీనియర్ నాయకులు. శంకర్ నాయుడు, పేటెలి దాసు బాబు, సత్య బుజ్జిబాబు, సంతోష్ కుమార్, బాలన్న లక్ష్మయ్య పాల్గొన్నారు.

పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - చింతపల్లి : వ్యాధుల నివారణకు హెూమియోపతి వైద్యం సంజీవిని వంటిది అని దయాల్ బాగ్ రాధాస్వామి చారిటబుల్ ట్రస్ట్ వైద్యాధికారి ఎం భాస్కర్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆ కళాశాల ప్రధానాచార్యురాలు డాక్టర్ ఎం విజయ భారతి ఆధ్వర్యంలో బాలల దినోత్సవం పురస్కరించుకొని గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి ప్రముఖ హెూమియోపతి వైద్యులైన భాస్కర్ రెడ్డి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ హెూమియోపతి వైద్యం ద్వారా ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించడమే తమ లక్ష్యం అన్నారు. కళాశాల ప్రధానాచార్యురాలు విజయభారతి,డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం శ్రీనివాస్ పాత్రుడు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి-హుకుంపేట:మండలంలోని గ్రంథాలయ వారోత్సవాలు గురువారం నిర్వహించారు. స్థానిక గ్రంథాలయం అధికారి వి.మానస నెహ్రూ చిత్రపటాన్ని పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ఆటలు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి- అనంతగిరి:మండలంలోని కొత్తూరు గ్రామపంచాయతీ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించేందుకు అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ సారా .సీతయ్య అన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కొత్తూరు గ్రామంలో తాగునీటి సౌకర్యం కల్పించేందుకు 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు లక్ష రూపాయలతో మరమ్మతు పనులు చేపట్టడం జరుగుతుందన్నారు.

బ్రహ్మానందరెడ్డిని పరామర్శించిన కొనకళ్ల

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఇటీవల ప్రమాదానికి గురైై కిమ్స్ ఎన్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎపిఎస్ఆర్‌టిసి జోన్ 1 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెఎస్.బ్రహ్మానందరెడ్డిని రీజినల్ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు గురువారం పరామర్శించారు. ఆయనకు మెరుగైన వైద్యం అందివ్వాలని కిమ్స్ ఎన్ఆర్ఐ ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు.

'దేవకి నందన వాసుదేవ' చిత్రయూనిట్ సందడి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దేవకి నందన వాసుదేవ చిత్ర యూనిట్ గురువారం నగరంలో సందడి చేసింది. శ్రీ లలితాంబిక ప్రొడక్షన్ బ్యానర్‌పై హీరో మహేష్‌బాబు మేనల్లుడు గల్లా అశోక్ హీరోగా, మానస వారణాసి హీరోయిన్‌గా, అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో, సోమినేని బాలకృష్ణ నిర్మిస్తున్న దేవకి నందన వాసుదేవ చిత్రం ప్రమోషన్‌లో భాగంగా గురువారం దసపల్లాలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో గల్లా అశోక్ మాట్లాడుతూ, మంచి కమర్షియల్ సినిమాకు వినోదం మేళవించినట్లు తెలిపారు. హనుమాన్ దర్శకుడు ప్రశాంత వర్మ కథ అందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత బాలకృష్ణ, హీరోయిన్ మానస వారణాసి పాల్గొన్నారు.



కీల్ ప్రాజెక్టు శంకుస్థాపనలో హిందూస్థాన్ షిప్‌యార్డు ఉద్యోగులు

హెచ్ఎస్ఎల్‌లో ఎఫ్ఎస్ఎస్ కీల్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : హిందుస్థాన్ షిప్‌యార్డు లిమిటెడ్‌లో కీల్ ప్రాజెక్టుకు గురువారం కంట్రోలర్ వార్‌షిప్ ప్రొడక్షన్ అండ్ అక్విసిషన్ విభాగం వైస్ అడ్మిరల్ బి.శివకుమార్ శంకుస్థాపన చేశారు. ఆధునిక యుద్ధనౌకల రూపకల్పన, నిర్మాణంలో హెచ్ఎస్ఎల్ సామర్థ్యం పెంచేందుకు ఇది ఉపయోగపడుతుందని శివకుమార్ తెలిపారు. హెచ్ఎస్ఎల్‌లో నిర్మాణంలో ఉన్న 44000 టన్నుల ఫ్లీట్ సపోర్ట్ షిప్ 80 శాతం స్వదేశీ కంటెంట్‌లో ఇది మొదటిదని, ఇది సముద్రంలో ఫ్లీట్‌ను ఇంధనం, నీరు, మందుగుండు సామగ్రి నిల్వలతో నింపడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

రీసెర్చ్ స్కాలర్స్ హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా విజయ్‌బాబు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : పరిశోధకుల వసతి గృహం చీఫ్ వార్డెన్‌గా మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు ఒమ్మి విజయ్ బాబు నియమితులయ్యారు. నియామక ఉత్తర్వులు ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇఎన్.ధనుంజయరావు అందజేశారు. శుక్రవారం ఉదయం ఆచార్య విజయ్ బాబు బాధ్యతలు స్వీకరిస్తారు.

సినీనటి శ్రీరెడ్డిపై ఫిర్యాదు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : సిఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనిత పట్ల అనుచితంగా వాఖ్యలు చేస్తూ యూట్యూబ్‌లో వీడియో చేసిన సినీనటి శ్రీరెడ్డిపై దక్షిణ నియోజకవర్గం తెలుగు మహిళ నాయకులు గురువారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

25 నుంచి 108 ఉద్యోగుల సమ్మె బాట



ఎంపిడిఒకు సమ్మె నోటీసులు అందజేసిన 108 సిబ్బంది

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : ఎన్నో ఏళ్లుగా పరిష్కృతంగా ఉన్న తమ డిమాండ్లను తక్షణం పరిష్కరించాలంటూ, లేకుంటే సమ్మెకు వెళ్లవలసి వస్తుందని తెలియజేస్తూ గురువారం ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, డిప్యూటీ తహశీల్దార్‌కు 108 సిబ్బంది సమ్మె నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా 108 యూనియన్ నాయకులు జోన్స్ మాట్లాడుతూ. ఈనెల 25లోగా తమ డిమాండ్లు ప్రభుత్వం పరిష్కరించాలని, లేకుంటే ప్రత్యక్ష సమ్మెలోకి దిగుతామని హెచ్చరించారు. ఇప్పటికే ప్రభుత్వానికి, 108 నిర్వహణ సంస్థకి సమ్మె నోటీసులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. 108 సర్వీస్‌ను ప్రభుత్వమే నేరుగా నిర్వహించాలని, నాలుగేళ్లుగా పెండింగ్లో ఉన్న ఏరియర్స్ చెల్లించాలని, ప్రస్తుతం ఉన్న 12 గంటల పని విధానాన్ని ఎనిమిది గంటలకు కుదించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, రూ.20 లక్షలు ప్రమాద బీమా కల్పించాలని, పిఎఫ్ యాజమాన్యం దగ్గర వసూలు చేయాలని, తెలంగాణ ప్రభుత్వం వలే ఇక్కడ కూడా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు 108 సిబ్బంది పాల్గొన్నారు.

దేవీపట్నం : తమ సమస్యలను పరిష్కరించకుంటే ఈ నెల 25న ఉండి సమ్మె చేస్తామని 108 సిబ్బంది గురువారం తహశీల్దారు, ఎంపిడిఒలకు సమ్మె నోటీసు అందజేశారు. ప్రతి ఏటా ఇవ్వవలసిన ఇంక్రిమెంట్స్, ఏరియల్ డబ్బులు అరబిందో గత నాలుగు సంవత్సరాలుగా ఇవ్వలేదు, వాటిని చెల్లించాలని సంఘం జిల్లా కోశాధికారి కొత్తపెల్లి సతీష్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రౌతు చిన్న జోగేశ్వరరావు, చిక్కాల వెంకటేశ్వరరావు, దేవీపట్నం లొకేషన్ ఇంచార్జి, సిబ్బంది పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి 104 సిబ్బంది వినతి



వినతిపత్రం ఇస్తున్న 104సిబ్బంది

రాజవొమ్మంగి :తమ సమస్యలను తక్షణం ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ 104 సిబ్బంది గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది శ్రీనివాసు, రాము మాట్లాడుతూ గత ఐదేళ్లుగా 104లో అనేక సేవలు అందిస్తున్నామని, సకాలంలో జీతం అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. 104 సిబ్బందిని పీహెచ్సీలకు అనుసంధానం చేయాలని, పనికి తగిన వేతనం ఇవ్వాలని, సకాలంలో వేతనాలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కల్పశ్రీ

ప్రజాశక్తి-మారేడుమిల్లి : ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యను సద్వినియోగం చేసుకోవాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ అన్నారు. మారేడుమిల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠశాలను, గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాలను గురువారం ఆమె సందర్శించారు. ముందుగా విద్యార్థులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశనుండే సక్రమంగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు బాలాజీ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



అరకులోయ శారదానికేతన్‌లో చాచా నెహ్రూకు నివాళులు...



సీలేరులో బాలల దినోత్సవాన విభిన్న వేషధారణలో చిన్నారులు

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండలంలోని బడిమెల జిపిఎస్ పాఠశాలలో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల బాష వాలంటీర్ పి కుమారి నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు కుర్చీ ఆటలు, పరుగు తోపాటు పలు రకాల ఆటలు పోటీలను నిర్వహించి బహుమతులను ప్రధానం చేశారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచి చదువుతోపాటు క్రీడలు కూడా నేర్చుకోవాలన్నారు. చిన్నప్పటి నుంచి క్రమశిక్షణను అలవర్చుకోవాలని ఆమె సూచించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

పెదబయలు :మండల కేంద్రం లో ప్రభుత్వ, గిరిజన సంక్షేమ వసతి గృహల్లో చదువుతున్న విద్యార్థులు బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అరడ కోట ప్రభుత్వ సంక్షేమ వసతి గృహంలో పదవ తరగతి విద్యార్థుల నెహ్రూ వేష దారణ చూపరులను ఆకట్టుకుంది . బాలల దినోత్సవం సందర్భంగా వివిధ క్రీడలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. గేయాలను ఆలపించారు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని శారద నికేతన్ పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు జరిగాయి.ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి వంతల త్రినాధరావు హాజరై జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం బాలల దినోత్సవం సందర్భంగా శారద నికేతన్,ప్రభుత్వ హై స్కూల్ విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అనంతరం మండల విద్యా శాఖ అధికారి వి త్రినాథ్ రావు మాట్లాడారు.ప్రతి సంవత్సరం నవంబర్ 14న నెహ్రూ జయంతి సందర్భంగా బాలల దినోత్సవం జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్ చిరంజీవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముంచింగిపుట్టు:కుమడ పంచాయతీ పూల బంధ ఎంపీపీ పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో మండల ఎంఈఓ కృష్ణమూర్తి, పాల్గొన్నారు. జర్రెల గ్రామ పరిధి సెల్లంపుట్ ఎంపీపీ పాఠశాలలో ఆర్పీలు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని శారదా నికేతన్ ఇంగ్లీష్ మీడియంలో చిన్నారులు ఆటపాటలు ప్రదర్శించారు. బహుమతులను పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్ మత్స్యరాజు, ప్రశాంతి, ధర్మారావు, పాల్గొన్నారు .



పెదబయలులో దేశభక్తి గీతాలాలపిస్తున్న విద్యార్థులు

సీలేరు: జీకే వీధి మండలం సీలేరు డిఎవి పాఠశాలలో బాలల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విజయవాడ విద్యుత్ సౌద ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ (సివిల్) కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డిఎవి పాఠశాల విద్యార్థులు ఝాన్సీ లక్ష్మీబాయి, సరోజినీ నాయుడు, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, అల్లూరి సీతారామరాజు, డాక్టర్, టీచర్ వేషధారణలతో ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతి కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ వాసుదేవ రావు, ఈఈలు రత్నరాజు, శ్రీనివాస్‌రెడ్డి, జి.భాస్కర్‌రావు ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డిఈఈ రాజేంద్రప్రసాద్, ఏడిఈలు కే.దుర్గా శ్రీనివాసరావు, టి.అప్పలనాయుడు, ఏఈలు అనుదీప్, సురేష్, డిఎవి పాఠశాల హెచ్ఎం ఎస్.కిరణ్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు జెన్కో సిబ్బంది పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో నెరహూకు నివాళులు

అడ్డతీగల : మండల కేంద్రంలో జడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయులు గవ్వరాజు అధ్యక్షతన ఘనంగా బాల దినోత్సవం నిర్వహించారు, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఆటపాటలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ చోడిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు. జూనియర్ కాలేజీలో ప్రిన్సిపాల్ రాజేంద్ర స్వామి అధ్యక్షతన జరిగిన బాలల దినోత్సవంలో మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ వీరలక్ష్మి కూటమి నాయకులు సత్యవతి, ఎడ్ల శ్రీనివాస్, చౌదరి జయరాం సాయి వెంకటేష్ పాల్గొన్నారు. బి.భీమవరం ఆశ్రమ పాఠశాల అల్లూరి సీతారామరాజు కాలనీ జిపిఎస్ పాఠశాలలో హెచ్ఎం నాగన్న దొర ఆధ్వర్యంలో బాలల దినోత్సవం నిర్వహించారు.

రాజవొమ్మంగి : స్థానిక గురుకుల పాఠశాల/ కళాశాల, ఆశ్రమ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అన్ని ప్రభుత్వ పాఠశాలల వసతి గృహాల్లో బాలల దినోత్సవాలు నిర్వహించారు. విద్యార్థుల వేషధారణలు చూపర్లను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థులు ఉపాధ్యాయ అవతారమెత్తి ఉపాధ్యాయులకు పాఠాలు బోధించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యేశ్వరరావు, గోపాలకృష్ణ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



అడ్డతీగలలో విజేతలకు బహుమతుల ప్రదానం

బాలల హక్కులు కాపాడుకుందాం

ప్రజాశక్తి-దేవీపట్నం : నేటి బాలలే రేపటి పౌరులని, ఐక్యరాజ్య సమితి ప్రకటించిన బాలల హక్కులు కాపాడుకుందామని మండల న్యాయ సేవాధికార సంస్థ రంపచోడవరం పారా లీగల్ వాలంటీర్లు యలగాడ నాగేశ్వరరావు, కారం రామన్న దొర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సంస్థ ఆధ్వర్యాన గురువారం బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం జరిగింది. నవంబర్ 14 మాజీ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ జయంతి రోజున బాలల దినోత్సవాన్ని జరుపుకోవడమంటే బాలల హక్కులు కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. విద్యార్థులకు భారత రాజ్యాంగం కల్పించిన బాలల హక్కులు, ఐక్య రాజ్య సమితి కల్పించిన బాలల హక్కులపై న్యాయ అవగాహన కల్పించారు. కఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

వార్షిక ప్రణాళికల తయారీపై శిక్షణ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం 2025-26 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ప్రణాళికలు తయారు చేసేందుకు బీపీడిపి, జిపిడిపి ప్లాన్ కోసం ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రణాళికలు పగడ్బందీగా రూపొందించాలని ఎంపీడీవో యాదగిరిశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె సత్యనారాయణ దొర, ఈవోపీఆర్డి, ఏవో, పలువురు పంచాయతీలు కార్యదర్శులు, డిఏలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసమే విజయానికి సోపానం

- గీతం బాలల సైన్స్ కాంగ్రెస్‌లో జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



నెహ్రూకు నివాళులర్పిస్తున్న శ్రీభరత్, కలెక్టర్ ప్రసాద్

ప్రజాశక్తి- మధురవాడ : పోటీప్రపంచంలో ఉన్నత స్థానానికి ఎదగాలంటే, కలలు నిజం చేసుకోవాలంటే ఆత్మవిశ్వాసమే విద్యార్థులకు సోపానంగా ఉపయోగ పడుతుందనిజిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్ అన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో జరుగుతున్న జవహర్ నవోదయ విద్యాలయాల ప్రాంతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ సమావేశాలలో మాట్లాడుతూ,. విద్యారంగం, క్రీడల్లో ఉన్నత స్థానానికి చేరాలంటే ఆత్మవిశ్వాసం, నూటికి నూరుశాతం కృషి చేయాలని సూచించారు. సుందర పచాయ్, సత్య నాదెళ్ళ భారతీయ మేథావులు స్వశక్తితో ప్రపంచంలోని మేటి సంస్థలలో కీలక స్థానాలలో పనిచేస్తున్న విషయాన్ని గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ ప్రకృతి విపత్తుల వంటి సంక్షోభ సమయంలో కంగారు పడకుండా ఉండటం ద్వారా స్పష్టమైన కార్యాచరణతో పనిచేయడం అవసరమన్నారు. సమాజ సేవకు సివిల్ సర్వీసులలోకి ప్రవేశించడం ఒక్కటే మార్గం కాదని, స్వచ్ఛంద సేవ ద్వారా ప్రజల జీవితంలో మార్పు తేవచ్చునన్నారు. సరైన నిపుణులు కొరత వల్లే వివిధ పనులకు ప్రభుత్వాలు కన్సల్టెంట్‌లను నియమించుకుంటున్నాయని ఈ స్థితిలో మార్పురావాలని ఆకాంక్షించారు. నిపుణతగల యువత ప్రభుత్వాల చెంత ఉంటే అభివృద్ధి ఊపందుకుంటుందన్నారు. తాను ఇంజనీరింగ్ ఎంబిఎ పూర్తి చేసి ప్రముఖ ఐటి సంస్థలో పనిచేసినప్పటికి, సివిల్ సర్వీసులలోకి రావడానికి సామాజిక సేవ చేయాలన్న సంకల్పమే కారణమన్నారు. గీతం ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమరావు, జవహర్ నవోదయ విద్యాలయ సమితి సహాయ కమిషనర్ డాక్టర్ ఇ.ఉమాపతిరెడ్డి, గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్. కెఎస్.కృష్ణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.వేదవతి, జవహర్ నవోదయ విద్యాలయ డిప్యూటీ డైరక్టర్ డాక్టర్ టి. గోపాలకృష్ణ, విశాఖ ప్రిన్సిపాల్ డాక్టర్ వైఎస్ఎస్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేటి బాలలే నవ భారత నిర్మాతలు: శ్రీభరత్

నేటి బాలలే నవ భారత నిర్మాతలని, నీతి నిజాయతీ, నైపుణ్యాలతో దేశప్రగతిలో భవిష్యత్‌లోకీలక పాత్ర పోషించాలని గీతం అధ్యక్షుడు, ఎంపీ ఎం.శ్రీభరత్ అన్నారు. బాలల సైన్స్ కాంగ్రెస్‌లో విద్యార్థులతో ముఖాముఖిలో పాల్గొన్నారు. చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలలు జవహర్ నవోదయ విద్యాలయా లవంటి సంస్థల అధ్యాపకులు అన్ని విధాలుగా సమర్థ బోధన అందిస్తున్నారన్నారు. ఇంజనీరింగ్ చదివే వారి సంఖ్య పెరిగినా నైపుణ్యాల కొరత వల్ల ఉద్యోగావకాశాలు తగ్గుతున్నాయన్నారు.